సాక్షి జగిత్యాల

గురువారం : 4 : మే : 2023



ఘనంగా అన్నకూటోత్సవం

ధర్మపురి: నృసింహుని నవరాత్రోత్సవాల్లో భాగంగా 8వ రోజు ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నకూటోత్సవం నిర్వహించారు.



చెరువుల పరిశీలన

కథలాపూర్ : అమృత్ సరోవర్‌లో భాగంగా అడిషనల్ డీఆర్డీవో శివాజీ భూషణరావుపేట, చింతకుంటలోని చెరువులు పరిశీలించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలి



జడ్జి నిహారికను సన్మానిస్తున్న న్యాయవాదులు

జగిత్యాలజోన్: న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ న్యాయమూర్తులు, న్యాయవాదులకు సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నీహారిక బదిలీపై వెళ్తున్న సందర్భంగా జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జడ్జి నీలిమ మాట్లాడుతూ, బదిలీపై ఎక్కడకు వెళ్లినా కేసులను సత్వరం పరిష్కరించేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. న్యాయవాదులు కోర్టు బెంచ్‌కు పూర్తిస్థాయిలో సహకరించారని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జడ్జి ప్రసాద్, రెండో అదనపు జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ వినిల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్, పలువురు న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న జగదీశ్వరశర్మ

జగిత్యాలరూరల్: ధర్మపురికి చెందిన మేడిపల్లి మండలం కట్లకుంట ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండి జగదీశ్వరశర్మకు ప్రముఖ వాగ్గేయకారుడు శ్రీతాళ్లపాక అన్నమయ్య అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ శ్రీలహరి క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ, మెట్రో టీవీ ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభ ఈ అవార్డు ప్రదానం చేసింది. పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు. జగదీశ్వరశర్మను బుధవారం పలువురు ప్రముఖులు అభినందించారు.

మున్సిపల్ పరిధిలో 'ఉపాధి' అమలు చేయాలి



ఆందోళన చేస్తున్న కూలీలు

జగిత్యాల: మున్సిపల్ పరిధిలో ఉపాధిహామీ పథకం అమలు చేయాలని అసంఘటిత కూలీ బిడ్డల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. మున్సిపల్ పరిధిలో అనేకమంది వ్యవసాయ కూలీలు, చిన్నరైతులు, పేదలు ఉన్నారని తెలిపారు. ఉపాధిహామీ లేకపోవడంతో పనులు లభించక గురవుతున్నామని వారు పేర్కొన్నారు. తమ కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. మున్సిపల్‌గా ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రభుత్వానికి చెల్లించే పన్నులు పెరిగాయని, ఉపాధి లేక ప్రత్యామ్నాయ పనులు లేక తిండికి ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని కేరళ, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్ ప్రాంతాల్లో అమలవుతున్న మాదిరిగా మనరాష్ట్రంలోని మున్సిపాలిటీలు, పట్టణాల్లో ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేదరి దేవవరం, రమణారెడ్డి, రాసమల్లయ్య, సూర లక్ష్మి, బోదాసు పద్మ, కొమురయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

పాడి పరిశ్రమపై దృష్టి



పశువుకు వైద్యం చేస్తున్న వైద్య విద్యార్థులు

కథలాపూర్(వేములవాడ): రైతులు పంటల సాగుతోపాటు పాడిపరిశ్రమపై దృష్టి సారించాలని కోరుట్ల పశువైద్య కళాశాల అసోషియేట్ డీన్ మాధవరావు సూచించారు. పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా బుధవారం భూషణరావుపేటలో పశువైద్యశిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. వ్యాధి నిర్ధారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యజమానులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి దివ్యశ్రీ, సర్పంచ్ కూన సులోచన, ప్రతినిధులు కట్కం రమేశ్, దైదా కృష్ణప్రసాద్, అరుణకుమారి, సురేశ్, పరుశురాం, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులు గల్లంతు!



- ఇతడి పేరు తోట గంగారాం. ఆస్తి పన్ను చెల్లించేందుకు వారంక్రితం కోరుట్ల మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాడు. ఇంటి నంబరు చెప్పగానే గంగారాం పేరిట ఇల్లే లేదని అధికారులు తేల్చేశారు. వేరేవాళ్ల పేరు ఎలా వచ్చిందని బిత్తరపోయిన గంగారాం.. ఇదేమిటని ప్రశ్నిస్తే.. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి అడుగు అని ఉచిత సలహా ఇచ్చారు. అక్కడికి వెళ్లి ఆరా తీస్తే.. తన ప్రమేయం లేకుండానే ఇతరులు చేసుకున్న రిజిస్ట్రేషన్‌లో తనఇంటి నంబరు నమోదు చేసి.. ఆ వివరాలను ఆన్‌లైన్ ద్వారా బల్దియా కార్యాలయానికి పంపినట్లు తెలిసింది. దానిప్రకారం ఏడాది క్రితమే ఆటో మ్యుటేషన్‌తో తన ఇల్లు వేరేవారి పేరిట నమోదైనట్లు స్పష్టమైంది.



కోరుట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- కోరుట్ల మెయిన్‌రోడ్డులోని ఓ దుకాణా యజమాని.. తన ఇంటి సమీపంలోని ఖాళీస్థలాన్ని వీఎల్‌టీ నంబరుతో తన బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. వారంక్రితం అతడు ఆస్తి పన్ను చెల్లించడానికి బల్దియా కార్యాలయానికి వెళ్తే.. ఖాళీ స్థలమే కాకుండా తన బంధువుల పేరిట నమోదు అయిందని తెలిసి నివ్వెరపోయాడు.

- కోరుట్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో లీలలు
- అడ్డగోలుగా ఆటో మ్యుటేషన్లు
- తప్పులతడకలుగా రిజిస్ట్రేషన్లు
- నివ్వెరపోతున్న ప్రజలు

కోరుట్ల: సాధారణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ తయారీ కోసం రైటర్లను ఆశ్రయించడం సాధారణంగా మారింది. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో అవగాహన లేనికొంత మంది డాక్యుమెంట్ రైటర్లు.. నివాసం లేదా ఖాళీస్థలం క్రయ, విక్రయాల డాక్యుమెంట్ తయారు చేసే సమయంలో తప్పులతడకగా వివరాలు నమోదు చేయడం.. అదే నమూనాతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్లకు ఓ సెక్షన్, ఖాళీస్థలాల రిజిస్ట్రేషన్లకు మరో సెక్షన్ ఉంటుంది. ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ నంబరుతో రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇంటిస్థలాల నంబర్లతో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి.. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇక్కడే సమస్య తలెత్తుతోంది. ఈ రెండు పద్ధతుల్లో పొరపాట్లు చోటుచేసుకోవడంతో యజమానులకు తెలియకుండానే.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లకుండానే ఒకరి ఆస్తులు మరొకరి పేరిట నమోదు కావడం గందరగోళానికి దారితీసోంది. వెలుగులోకిరాని ఇలాంటి తప్పిదాలు అనేకం జరిగినా అధికారులు స్పందించడంలేదు.

దిద్దుబాటు పరేషాన్..

- పొరపాటుగా ఆస్తులకు చెందిన వీఎల్‌టీ లేదా ఇంటి నంబర్లు మారి రిజిస్ట్రేషన్లు జరగడంతో ఆ వివరాలు ఆటో మ్యుటేషన్ ప్రక్రియ ద్వారా ఆన్‌లైన్‌లో మున్సిపల్ కార్యాలయానికి చేరుతున్నాయి.
- ఆ వివరాల ప్రకారం.. మున్సిపల్ అధికారులు పేరు మార్పిడి చేసి ఆస్తి పన్ను లేదా ఖాళీ స్థలాల పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది.
- మున్సిపల్ అధికారులు పన్నుల వసూలుకు వెళ్తున్న సందర్భంలో లేదా ఆస్తి హక్కుదారులు పన్ను చెల్లించే సందర్భంగా జరిగిన పొరపాట్లు వెలుగులోకి వస్తున్నాయి.
- ఈ పొరపాటును సరిదిద్దే అంశం తమ పరిధిలో లేదని మున్సిపల్ అధికారులు తేల్చి చెపుతుండగా.. మున్సిపాల్టీలో సరిదిద్దే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదని..తాము సమస్యను జిల్లా రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్తే కాలాయాపన జరుగుతుందని సబ్ రిజిస్ట్రార్ అధికారులు అంటున్నారు.
- మొత్తం మీద పొరపాట్లు అధికారులు చేస్తే ఆస్తి హక్కుదారులు మాత్రం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తిప్పలు పడుతున్నారు.
- ఉన్నతాధికారులు తగిన రీతిలో స్పందించి అవసరమైన చర్యలు తీసుకుని పొరపాట్లను సరిదిద్దాలని బాధితులు కోరుతున్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌కు నివేదిస్తాం

వీఎల్‌టీ, ఇంటి నంబర్ల నమోదులో పొరపాట్లు జరగడంతో తప్పులు చోటు చేసుకున్నట్లుగా భావిస్తున్నాం. వీటిని సరిదిద్దడానికి జిల్లా రిజిస్ట్రార్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పొరపాటున ఆస్తుల వివరాలు మారిన వారు మాకు దరఖాస్తు చేసుకోవాలి. కొంత కాలయాపన జరిగినా ఆటో మ్యుటేషన్‌లో జరిగిన పొరపాట్లు సరిచేస్తాం.

– శ్రీధర్‌రాజు, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, కోరుట్ల

స్నేహితులను బలిగొన్న డీసీఎం వ్యాన్





సంఘటనా స్థలంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువకులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మిత్రుల దుర్మరణం
- క్యాటరింగ్‌కు వెళ్లి వస్తుండగా స్కూటీని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్
- కన్నీరుమున్నీరవుతున్న మృతుల కుటుంబాలు





నుజ్జునుజ్జయిన డీసీఎం వ్యాన్, స్కూటీ



మొయిన్‌ఖాన్(ఫైల్)



అభిషేక్(ఫైల్)

జగిత్యాలక్రైం: ఎండీ మొయిన్‌ఖాన్(21), గోకుల అభిషేక్(22), వరుణ్ సందీప్‌గౌడ్(20) మంచి మిత్రులు.. పేద కుటుంబాలకు చెందిన ఈ ముగ్గురు ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు తీరిక సమయాల్లో ఎంతోకొంత ఆదాయం ఆర్జించేందుకు శుభకార్యాల్లో క్యాటరింగ్(వంటలు తయారు చేయడం) పనులు చేస్తున్నారు.. తల్లిదండ్రులకూ చేదోడువాదుగా ఉంటున్నారు. భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఎన్నోకలలు కన్నారు. వారి ఆశలను డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు కబళించుకుపోయింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ శివారులో బుధవారం ఈ ఘటన జరిగింది. బీమారానికి చెందిన ఎండీ మొయిన్‌ఖాన్, రాగోజీపేటకు చెందిన గోకుల అభిషేక్, మేడిపల్లికి చెందిన వరుణ్ సందీప్‌గౌడ్ బుధవారం కొడిమ్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహ వేడుకల్లో వంటలు తయారు చేసేందుకు(క్యాటరింగ్) ఒప్పందం చేసుకున్నారు. ఈక్రమంలో బుధవారం ఉదయమే అక్కడకు చేరుకున్నారు. క్యాటరింగ్ ప్రక్రియ పూర్తయ్యాక సాయంత్రం తమ ద్విచక్ర వాహనం (స్కూటీ)పై తిరుగు ప్రయాణమయ్యారు. కొడిమ్యాల మండలం కోనాపూర్ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోకుల అభిషేక్, ఎండీ మొయిన్‌ఖాన్ మృతిచెందారు. వరుణ్ సందీప్ గౌడ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతి చెందాడు. ఈ ముగ్గురి కుటుంబాలు పేదవి కావడంతో ఎంతోకొంత ఆర్థిక సాయం చేసేందుకు యువకులు క్యాటరింగ్ పనులు ఎంచుకున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత వీరి ఖర్చులకు ఉంచుకుని, మిగతా సొమ్ము తల్లిదండ్రులకు ఇస్తూ వస్తున్నారు. ఎదిగి వచ్చిన కొడుకులు తమ బాగోలు చూస్తారని వారి తల్లిదండ్రులు భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, రోడ్డు ప్రమాదం ఆ ముగ్గురి బలితీసుకుని మూడు కుటుంబాల ఆశలను అడియాసలు చేసింది. ఆస్పత్రుల్లో కుమారుల మృతదేహాలను చూసిన మృతుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎటు వెళ్లినా, ఏ పనిచేసినా ముగ్గురు స్నహితులు కలిసే చేసేవారని, అలాంటి వారిని విధి వక్రీకరించి ఇద్దరని బలితీసుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

కేసులు ఎత్తివేయండి

జగిత్యాలక్రైం: వెల్గటూర్ మండలం పాశి గామ, స్తంభంపల్లి గ్రామస్తులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ కోరారు. గ్రామస్తులతో కలిసి బుధవారం ఎస్పీ భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇథనాల్ పరిశ్రమతో సమీప గ్రామాలకు ముప్పు ఉందని ప్రజలు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు కేసులు పెట్టడం సరికాదన్నారు.

'ప్రభుత్వం విఫలం'

జగిత్యాలరూరల్: అకాల వర్షాలతో పంట లు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆ దుకోవడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వి మర్శించారు. లక్ష్మీపూర్ ఐకేపీ ధాన్యం కొ నుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

గండం వీడలే..!

- మరో నాలుగు రోజులు వానలు కురిసే అవకాశం
- ఉమ్మడి జిల్లాకు పొంచిఉన్న ఈదురుగాలుల ముప్పు
- ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో పంటల నష్టం
- పాత జిల్లాలో సాధారణానికి మించి కురిసిన వాన



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లారైతులపై ప్రకృతి ప్రకోపం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఏప్రిల్ నెలలో మొదలైన వరుణుడి ప్రతాపం.. మే నెలలోనూ కొనసాగేలా ఉంది. ఈనెల 4, 5, 6, 7వ తేదీల్లోనూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవ వచ్చని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. గత ఏప్రిల్‌లో వరుసగా వడగండ్లు, అకాల వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గత వందేళ్లలో రాష్ట్రంలో ఏనాడూ చూడని చెడగొట్టు వానలని ప్రభుత్వమే అభివర్ణించడం ప్రస్తుత పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా ఏప్రిల్ 22,24,30వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున పంటనష్టం చేకూరింది. ఆరుగాలం శ్రమించిన పంట వడగండ్ల దెబ్బకు ధ్వంసం కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు కల్లాల్లో తడిసిన ధాన్యం కొంటామని, ఎకరానికి రూ.10వేల పంట నష్టపరిహారం ఇస్తామన్న ప్రభుత్వ హామీతో పరిహారం కోసం కోటికళ్లతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏ జిల్లాలో ఎలా అంటే

ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. వీటి ప్రభావం జగిత్యాల, సిరిసిల్లలో తక్కువగా కరీంనగర్, పెద్దపల్లిలో అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షంకురిసినా.. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పోలీసులు, రెవెన్యూ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని ముందుజాగ్రత్తగా సూచనలు కూడా చేసింది. కరీంనగర్ జిల్లాలో తాజా సమాచారం ప్రకారం.. 56,066 ఎకరాలు, జగిత్యాలలో 65,794 ఎకరాలు, సిరిసిల్లలో 18,230 ఎకరాలు, పెద్దపల్లి 36,596 ఎకరాల మేర పంటలు నాశనమయ్యాయి. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో 1,76,686 ఎకరాల్లో పంట నష్టపోయిందని, ఇది దాదాపు రెండు లక్షల ఎకరాల వరకు చేరుకునే అవకాశముందని సమాచారం. ఇప్పటి వరకూ ప్రాథమిక నష్టంగా అంచనా వేసిన ప్రభుత్వం దీనిపై త్వరలోనే తుది నివేదిక రూపొందించిన అనంతరం రైతులకు పరిహారం విడుదల చేయనుంది. ఇప్పటికే అనేక గండాలు దాటుకున్న రైతన్న రాబోయే నాలుగు రోజులు కూడా విషమపరీక్షే ఎదుర్కొవాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరికోతలు ఇప్పుడే చేపట్టవద్దని వానల గండం తొలిగాక చేపట్టడం మంచిదని సూచిస్తున్నారు. మిగిలిన వాణిజ్య పంటల విషయంలో సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

దంచి కొట్టిన వానలు

మండువేసవిలో అకాల వర్షాలు వానాకాలాన్ని తలపించాయి. ఒకదశలో భారీవానలు రెండుమూడు రోజులపాటు తుపానును తలపింపజేశాయి. ఈ సీజన్‌లో కురవాల్సిన వానల కన్నా అధికంగా కురిశాయని వాతావరణశాఖ వెల్లడించింది. సాధరణంగా వేసవిలో అసలు వానజాడ కానరాదు. కానీ, ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రకృతి పగబట్టినట్లుగా ఒకదాని తరువాత మరొకటి, వరుసగా భారీ వానలు, వడగండ్లు, ఈదురుగాలులు రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. ఈ సీజన్‌లో సగటున 3 సెం.మీల వర్షపాతం నమోదైతే అది సాధారణ వర్షపాతం కింద లెక్క. కానీ విచిత్రంగా ఉమ్మడి జిల్లాలో కనిష్ఠంగా 11 సెం.మీల నుంచి గరిష్ఠంగా 17 సెం.మీల వరకు కురవడంపై వ్యవసాయశాఖ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్, సిరిసిల్లలో వానలు దంచికొట్టగా.. జగిత్యాల, పెద్దపల్లిలోనూ బాగానే కురిశాయి.

మార్చి ఒకటో తేదీ నుంచి మే మూడో తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో సగటు వర్షపాతం

జిల్లా	అసలు(మి.మీ)	సాధారణం (మి.మీ)	వ్యత్యాసం
కరీంనగర్	173.3	33.9	411
జగిత్యాల	114.1	39.5	189
పెద్దపల్లి	121.1	29.6	309
రాజన్నసిరిసిల్ల	161.6	40.8	296



కొనుగోళ్లలో ఆలస్యంతోనే రైతులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వివేక్

బుగ్గారం(ధర్మపురి): కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతోనే రైతులకు కష్టాలు ఎదురవుతున్నాయని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ విమర్శించారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన మద్దునూర్, శెకెల్ల గ్రామాల రైతులను బుధవారం ఆయన కలుసుకున్నారు. వారి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించారు. అకాల వర్షాలతో మామిడి, వరి, మక్క, నువ్వు తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. తెలంగాణలో ఫసల్ బీమా యోజన పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు మెడవేణి శ్రీధర్, రాజేశ్, గాజుల మల్లేశం, కాడె నారాయణ, ఓరుగంటి చంద్రశేఖర్, చక్రపాణి, మహేశ్ పాల్గొన్నారు.

దళితబంధుపై అధికారుల కసరత్తు

- రెండోవిడతలో నియోజకవర్గానికి 1,100 యూనిట్లు
- లబ్ధిదారుల ఎంపికకు సన్నాహాలు



మంజూరు పత్రం అందిస్తున్న ప్రత్యేకాధికారి(ఫైల్)

జిల్లా సమాచారం

దళిత కుటుంబాలు	57,006
దళిత జనాభా	1,78,760
తొలివిడత లబ్ధిదారులు	345
రెండోవిడతలో మంజూరు (ఒక్కో నియోజకవర్గానికి)	1,100

కథలాపూర్(వేములవాడ): దళితులకు శాశ్వత ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేస్తోంది. దీనిద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు సాయం చేస్తోంది. నేరుగా నగదు ఇవ్వకుండా ఉపాధి, వ్యాపారాలు ఏర్పాటు చేయిస్తోంది. ఒకేసారి కాకుండా విడతల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో తొలివిడతలో గతేడాది జిల్లా వ్యాప్తంగా 345 మందిని ఎంపిక చేశారు. వారు తమకు అనుకూలమైన యూనిట్లు నెలకొల్పారు. ప్రస్తుతం రెండోవిడత కోసం కసరత్తు చేస్తున్నారు.

ప్రస్తుతం నియోజకవర్గానికి 1,100 యూనిట్లు

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా.. 380 గ్రామాలున్నాయి.
- దళితబంధు తొలివిడతలో నియోజకవర్గానికి 100 మందికి అవకాశం కల్పించడంతో చాలామంది దళితులకు లబ్ధి చేకూరలేదు. వారంతా నిరాశలో ఉన్నారు.
- రెండోవిడతలో నియోజకవర్గానికి 1,100 మంది లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- జిల్లా పరిధిలో జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా... ధర్మపురి నియోజకవరగంలో ఆరు మండలాలు, చొప్పదండి నియోజకవర్గంలో రెండు మండలాలు, వేములవాడ నియోజకవర్గంలో మూడు మండలాలు మాత్రమే ఉన్నాయి. మిగతావి ఇతర నియోజకవర్గాల్లోకి ఉన్నాయి.
- ప్రస్తుతం ప్రతీ మండలంలో సుమారు 150 నుంచి 200 మంది లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఎంపిక ప్రక్రియ మారేనా..?

తొలివిడతలో లబ్ధిదారుల ఎంపిక బాధ్యత పూర్తిగా ఎమ్మెల్యేలదేపైనే ఉంది. దీంతో లబ్ధిదారులు ఎక్కువగా అధికార పార్టీకి చెందినవారే ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. రెండోవిడతలో ఎమ్మెల్యేలకు పూర్తిస్థాయి బాధ్యతలు ఇవ్వకుండా జిల్లాస్థాయి అధికారులను నియోజకవర్గానికి ఒకరిని ప్రత్యేకాధికారిగా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రత్యేకాధికారులే అర్హులను ఎంపిక చేసేలా నిబంధనలు తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఈఏడాది అసెంబ్లీ ఎన్నికలు రానుండటంతో ప్రభుత్వంపై విమర్శలు రాకుండా తొలివిడతలోని లోపాలను సవరించుకుంటూ విధివిధానాలపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు అధికార పార్టీకి చెందిన దళిత నాయకులు తాము ఇన్నాళ్లు పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా తమనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ముఖ్య నేతలతో సంప్రదింపులు చేస్తున్నారు.

పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలి



రెండోవిడత దళితబంధులో పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అధికారులు గ్రామాల్లో సర్వేచేసి అర్హులను గుర్తించి లబ్ధి చేకూర్చాలి. యూనిట్‌తో లబ్ధిదారుల కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందేలా ఉండాలి. అలంకారప్రాయమైన యూనిట్లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోతుంది.

– బాలె నీలకంఠం, బీఎస్పీ నేత

విధివిధానాలు రావాలి



రెండోవిడత దళితబంధు అమలు విషయంలో విధివిధానాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. తొలివిడతగా జిల్లాలో 345 మందికి లబ్ధి చేకూరింది. రెండోవిడతలో నియోజకవర్గానికి 1,100 మందిని ఎంపిక చేయాలని నిర్ణయించాం. లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉంటుంది.

– లక్ష్మీనారాయణ, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

క్లుప్తంగా

లక్ష్య సాధనకు కృషిచేయాలి

• కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో గ్రూప్స్ టాపర్లకు కాసుగంటి నారాయణరావు స్మారక క్యాష్ అవార్డులను మంగళవారం అందజేయగా బుధవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ... ప్రతీ విద్యార్థి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. టాపర్లకు అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్, వైస్ ప్రిన్సిపల్ కరుణాకర్, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఎలిజబెత్ రాణి పాల్గొన్నారు.

కొండగట్టులో షూటింగ్ సందడి

మల్యాల: మండలంలోని ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా షూటింగ్‌ను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కెమెరా ఆన్ చేసి, షూటింగ్‌ను ప్రారంభించారు. జమ్మికుంటకు చెందిన దర్శకుడు గౌతమ్‌కృష్ణ, నిర్మాత సతీశ్ అమ్మ బ్యానర్‌లో నిర్మిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా ముహూర్తం షాట్ కొండగట్టులో చేయగా, ఎమ్మెల్యే రవిశంకర్ తనయుడు సుంకె దీక్షిత్ ఏసీపీ క్యారెక్టర్‌లో హీరోగా, హైదరాబాద్‌కు చెందిన నవ్య శ్రీనివాస్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతోపాటు, సినిమా యూనిట్ సభ్యులందరూ ఆంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. మిట్టపల్లి సుదర్శన్, జనగం శ్రీనివాస్ ఆలయ ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, కొంక నర్సయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో 1999–2000లో చదివిన పదో తరగతి విద్యార్థులు, కుటుంబ సభ్యులు సమావేశం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన

రాయికల్(జగిత్యాల): వడ్డెరకాలనీ గ్రామపంచాయతీ కార్యాలయానికి ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించొద్దని సర్పంచ్ వెంకమ్మ డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఆమె తాళం వేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుజాత, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుల బతుకులు ఛిద్రం


జగిత్యాలజోన్:గీత కార్మికులకు ఉపాధి కరువై బతుకులు ఛిద్రం అవుతున్నాయని గౌడ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గపు రవీందర్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం 'గోపా' సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, గీతకార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేరితేనే గీతకార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతుబీమా తరహాలో చెట్టుపై నుంచి పడి చనిపోయిన గీతకార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం చెల్లించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడం అభినందనీయమన్నారు. నాయకులు అంబటి రాజయ్యగౌడ్, గుర్రం సత్యనారాయణగౌడ్, సత్తయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

జగిత్యాల: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆలయ వేద పండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మూడవ రోజు వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యహోమం, నవగ్రహ హోమం, బలిహరణ, స్వామివారికి డోలోత్సవం, వేదసదస్సు నిర్వహించారు. భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

పర్యాటకం కలేనా?

• ప్రాచీన బౌద్ధ స్తూపాన్ని మరిచిన పాలకులు • పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి
• రోడ్డు, వసతులు లేక ఆసక్తిచూపని పర్యాటకులు • ఈనెల 5న బౌద్ధ జయంతి



ఎలిగేడు/జూలపల్లి: బౌద్ధమత బోధనలతో ఫరిడవిల్లిన నేల ధూళికట్ట. గత అనుభవాన్ని ఈతరం ప్రజలు గుర్తుచేసుకుంటూ.. రాబోయే తరానికి అందించాల్సిన పూర్వీకుల చరిత్ర, సంప్రదాయ వారసత్వ వైభవం ఉన్న అపురూప ప్రదేశం. ఇక్కడి బౌద్ధస్తూపం తెలంగాణకే తలమానికం. ఇంతటి వైభవం ఉన్న ఈ ప్రాంత అభివృద్ధిని పాలకులు విస్మరించడం గమనార్హం.

రెండు మండలాల సరిహద్దులో..

ఎలిగేడు మండలం ధూళికట్ట, జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామాల సరిహద్దులో.. హుస్సేన్‌మియావాగు తీరాన ఉంది బౌద్ధస్తూపం. ధూళికట్టలో కోటలు, శాతవాహన రాజుల కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. ఆరో శతాబ్దంలో బాదనకుర్తిలో నివసించిన బావరి మహర్షి ఆహ్వానం మేరకు గౌతమ బుద్ధుడు ధూళికట్టలో పర్యటించినట్లు చరిత్ర చెబుతోంది. హుస్సేనిమియావాగు తీరంలో గౌతముడు ఏడువారాలపాటు గడిపాడనీ ప్రతీతి. శాతవాహన రాజుల కాలంలో ధూళికట్టలో రాజభవనాలు ఏర్పాటుచేసుకుని హుస్సేనిమియావాగు తీరంలో కోటలు, బౌద్ధస్తూపాన్ని నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. కోటలను మట్టితో నిర్మించడంతో ధూళికోటగా పిలిచేవారనీ, కాలక్రమేణా ధూళికట్టగా మారిందని చెబుతుంటారు.

వెలుగుచూసింది ఇలా..

శాతవాహనుల రాజులకాలంనాటి సంస్కృతి, సంప్రదాయాలను వెలికి తీసేందుకు 1972లో అప్పటి పురావస్తుశాఖ నిపుణులు డాక్టర్ వీవీ.కృష్ణశాస్త్రి, కర్నాటకకు చెందిన స్వర్గీయ ఠాకూర్ రాజారాంసింగ్, డాక్టర్ గురు రాజారావు ఆధ్వర్యంలో ధూళికట్టలో తవ్వకాలు చేపట్టి, పరిశోధనలు చేశారు. ఇందులో శాతవాహనుల కాలం నాటి బౌద్ధస్తూపం, కోట ముఖద్వారం, ఐదుపడగల ముచిలిందనాగం, భోదివృక్షం, యక్షులు, స్తూప నమూనాలు, మహాభినిష్క్రమణం, బుద్ధుని ప్రతిమలు, రాగినాణేలు, మట్టిబొమ్మలు, కుమ్మరి గాజులు, మృణ్మయ పాత్రలు వెలుగుచూశాయి. ఆనాటి ప్రజలు ప్రాకృతభాష, బ్రహ్మలిపి వాడినట్లు గుర్తించారు. బౌద్ధస్తూపాన్ని 19గుంటల స్థలంలో 36మీటర్ల వ్యాసార్థంతో చతురాస్రాకారంలో కాల్చిన ఇటుకలను మందంగా తయారు చేయించి వాడినట్లు ధ్రువీకరించారు. ఇక్కడ లభించిన సున్నపు పలకలు, స్తూప నమూనా ఫలకాలు ఇప్పటికీ కరీంనగర్‌లోని పురావస్తు శాఖ మ్యూజియంలో ఉన్నాయి.

అభివృద్ధికి రూ.39లక్షలు

ధూళికట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2002లో అప్పటి ప్రభుత్వం బౌద్ధ స్తూప పునఃనిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ స్తూపానికి వాడే ఇటుకలను ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించారు. ఏమైందో తెలియదుగానీ.. కొంతమేర నిర్మాణం చేసి పనులు నిలిపివేశారు. అనంతరం అప్పటి పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ తన కోటా నుంచి రూ.50లక్షలు కేటాయించారు. ఆ నిధులతో రహదారి, బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎంపీ తన నిధులను వెనక్కి తీసుకున్నారు. బౌద్ధస్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించారని పేర్కొంటూ ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎలిగేడు మండల కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష కూడా చేపట్టారు.

పిక్నిక్ స్పాట్‌గా..

బౌద్ధస్తూపం పర్యాటకులు, సందర్శకులకు పిక్నిక్ స్పాట్‌గా మారింది. కరీంనగర్ నుంచి కాచాపూర్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ధూళికట్ట వరకు రూ.30 చార్జీతో చేరుకోవచ్చు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి జెండాచౌరస్తా మీదుగా రూ.50తో ఆటోలో చేరుకోవచ్చు. ధూళికట్ట చేరుకున్నాక బౌద్ధస్తూపానికి వెళ్లాలంటే కనీసం రెండు కిలోమీటర్లు నడవాలి. సొంత వాహనాలు ఉంటే నేరుగా చేరుకోవచ్చు.

ఏటా జయంతి ఉత్సవాలు

బౌద్ధస్తూపం వద్ద ఏటా మేలో బౌద్ధజయంతిని ఘనంగా నిర్వహిస్తారు. మహారాష్ట్ర నుంచి బౌద్ధసన్యాసులతో ప్రత్యేక పూజలు చేయిస్తారు. బౌద్ధులే ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఈనెల 5న బౌద్ధజయంతికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



నాగభూమిగా పిలిచే బౌద్ధస్తూపం అభివృద్ధితో ఈ ప్రాంతం పర్యాటకంగా మారుతుంది. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు చేసుకునేందుకు వనరులు ఉన్నాయి. బౌద్ధ జయంతికి ప్రభుత్వం సహకరించాలి.

– మొగురం రమేశ్, ఉత్సవ కమిటీ చైర్మన్, వడ్కాపూర్

పర్యాటకకేంద్రంగా మార్చాలి



సాక్షాత్తు బుద్ధుడే ఇక్కడ ధ్యానం చేశాడని చరిత్ర చెబుతోంది. బౌద్ధ స్తూపం విశిష్టత, ఈ ప్రాంతానికున్న ప్రాముఖ్యత ముందుతరాలకు తెలి సేలా.. పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం, పర్యాటక శాఖ ముందుకు రావాలి.

– మంచాల వెంకటస్వామి, మాజీ సర్పంచ్, వంగర

సొంత ఖర్చుతో రోడ్డు వేయించా



బౌద్ధస్తూపం వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సొంత డబ్బులు వెచ్చించి మట్టి రోడ్డువేయించా. ప్రస్తుతం ఆ మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జయంతికి వచ్చేవారి కోసం రోడ్డుతోపాటు కల్వర్టు నిర్మించాలి.

– కొట్టె రాజయ్య, వడ్కాపూర్

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



అతి ప్రాచీనమైన బౌద్ధస్తూపానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి పర్యాకట కేంద్రంగా తీర్చిదిద్దాలి. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. గత చరిత్రను ప్రజలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

– గొల్లె కావేరి సర్పంచ్, ధూళికట్ట

అభివృద్ధి చేయాలి



అతి పురాతనమైన ధూళికట్ట బౌద్ధ స్తూపాన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి, ప్రజలు సందర్శించి చూసేందుకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయాలి.

– ఇరుగురాల సావిత్రమ్మ, ఎంపీటీసీ, ధూళికట్ట

కత్తితో దాడి.. వ్యక్తికి గాయాలు

కోరుట్ల రూరల్ : మండలంలోని కల్లూరులో కత్తితో దాడిచేసిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం బొమ్మెనకు చెందిన దండ్ల వంశీ (20) కల్లూరుకు చెందిన తమల్ల సంపత్ (36) కు రెండేళ్ల క్రితం గొడవలయ్యాయి. వంశీ బుధవారం కల్లూరులోని తన బంధువు వెంకటేశ్ వద్దకు వచ్చాడు. ఇద్దరు గ్రామంలోని రోడ్డు పక్కన మట్లాడుకుంటున్నారు. వంశీని గమనించిన సంపత్ పాత కక్షతో కత్తితో వంశీపై దాడిచేశాడు. ఈ దాడిలో వంశీకి గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

తుంగూర్‌లో కేడీసీసీబీ బ్రాంచ్

• నెలరోజుల్లో అందుబాటులోకి..
• 19 గ్రామాలకు దరిచేరనున్న సేవలు
• ఉమ్మడి జిల్లా సీఈవో సత్యనారాయణరావు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో కేడీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటు చేస్తున్నామని, 19 గ్రామాల ప్రజలు, రైతులకు సేవలు దరిచేరడమే లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు తెలిపారు. నెల రోజుల్లో బ్యాంక్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. బ్యాంకు ఏర్పాటుకు అనువైన భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. నాబార్డు నుంచి ఇప్పటికే అనుమతులు వచ్చాయని అన్నారు. బీర్‌పూర్, కొల్వాయి గ్రామాల సింగిల్‌విండోలతోపాటు, మరికొన్ని సింగిల్‌విండోలను దీని పరిధిలోకి తీసుకొస్తామని వివరించారు. బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాలు, ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, దొంతాపూర్, జైన, తీగలధర్మారం గ్రామాలకు సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఉమ్మడి జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ నవీన్‌రావు, సర్పంచ్ శ్రీమతి, ఎంపీటీసీ మల్లీశ్వరి, మాజీ జెడ్పీటీసీ రమణ, మేనేజర్లు హన్మంతరావు, శ్రీనివాస్, సింగిల్‌విండో సీఈవో అయ్యోరి తిరుపతి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ రాజేశం పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడుగుంత నిర్మించుకోవాలి

జగిత్యాలరూరల్: ఇంటికో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సెర్ప్ అధికారి వెంకటేశ్ సూచించారు. స్థానిక సెర్ప్ కార్యాలయంలో జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్ మండలాలకు చెందిన వీవోఏల తో ఇంకుడుగుంతల తవ్వకంపై సమీక్షించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సెర్ప్ మహిళా సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా ఇంకుడుగుంతలు నిర్మించుకుని ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లాలో వందశాతం ఇంకుడుగుంతల నిర్మాణం పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని చెప్పారు. ఏపీఎం గంగాధర్, డీఎం దేవయ్య, స్త్రీనిధి మేనేజర్ మారుతి, సీసీలు సాగర్, రవీందర్, సంతోష్, రాజేందర్ పాల్గొన్నారు.

ప్రాణాలు రక్షించేందుకు..!

• అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు ఎక్కడ?
• అత్యవసర సమయాల్లో 'ప్రైవేటే' దిక్కు
• జిల్లా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా సౌకర్యాలేవీ?



అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్

జగిత్యాల: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని తరలించేందుకు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు ఎంతో ఉపయోగపడతాయి. ఇవి ఎక్కువగా వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ లాంటి పెద్దపెద్ద పట్టణాల్లో మాత్రమే ఉంటాయి. ఈ అంబులెన్స్‌లలో అన్నిరకాల సదుపాయాలు ఉండటంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగి బతికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. జగిత్యాల జిల్లా కావడం, ఇక్కడ వైద్య కళాశాల ఏర్పడటంతో ఇది తప్పనిసరిగా ఉండాలి. జిల్లాగా ఏర్పడి ఏడేళ్లవుతున్నా ఈ అంబులెన్స్ సౌకర్యం ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం 108 అంబులెన్స్‌లు ఉన్నా ఈ వాహనాల ద్వారా ఎక్కువగా గాయపడిన వారు, బీపీ, షుగర్, తీవ్ర అస్వస్థతకు గురైనవారిని తరలిస్తుంటారు. కానీ అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లతో రోగులకు ఇబ్బందులు తప్పుతాయి. ఇటీవల ఎక్కువగా గుండెపోటు, ఫుడ్ పాయిజన్, కార్డియాక్ అరెస్ట్, ఊపిరితిత్తులు, శ్వాస ఆడకపోవడం లాంటి సమస్య ఏర్పడినప్పుడు ఈ అంబులెన్స్ ఎంతో అవసరముంటుంది. ప్రభుత్వ వైద్య కళాశాల ఉన్నచోట ఇది ఉండాల్సి ఉంటుంది. జగిత్యాల జిల్లా కేంద్రమై వైద్య కళాశాల ఏర్పడినా ఇంతవరకు ఏర్పాటు కాలేదు. దీంతో ప్రైవేటు అంబులెన్స్‌లే దిక్కవుతున్నాయి.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

గతంలో ఈ అంబులెన్స్‌ల కోసం మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా ఏర్పాటు చేసేలా హామీ ఇచ్చినట్లు తెలిసింది. కానీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఇవి ఎక్కువగా ప్రైవేటులో కార్పొరేట్ సిటీల్లో మాత్రమే ఉంటాయి. అత్యధిక రేటు ఉండటంతో ఎక్కువగా వినియోగించరు. ఒకవేళ ఈ అంబులెన్స్‌ల ద్వారా వెళ్తే రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లా కేంద్రానికి అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇందులో ఐవీ ఫ్లూయిడ్స్, కార్డియాక్, మానిటర్, ఆక్సిజన్ వెంటిలేటర్, వైద్యసేవల నిపుణులు, ఫీజర్ బాక్స్ లాంటి సౌకర్యాలు ఉంటాయి.

రెండు అంబులెన్స్‌లే గతి..

జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి రెండు అంబులెన్స్‌లు మాత్రమే ఉన్నాయి. వైద్య కళాశాల కావడం, జనరల్ ఆస్పత్రిగా మారడంతో నిత్యం ఎంతోమంది రోగులు వస్తున్నారు. అత్యవసర రోగులకు ఈ అంబులెన్స్‌లే దిక్కవుతున్నాయి. ఇద్దరు పేషెంట్లను అత్యవసరమైతే రెండు అంబులెన్స్‌ల్లో తరలిస్తే మళ్లీ అవి వచ్చేవరకు వేచి ఉండాల్సిందే. లేదంటే ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి. దీంతోవారు పేదప్రజల నుంచి అందినంత దోచుకుంటున్నారు. కనీసం ఈ ప్రభుత్వ ఆస్పత్రిలోనైనా మరో 2–3 అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం

గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఉంటే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది. ఇందులో అన్ని సౌకర్యాలుంటాయి. రోగులు బతికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు కేవలం రెండు అంబులెన్స్‌లు ఉన్నాయి. వాటి ద్వారానే పంపిస్తున్నాం.

– రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

• బీజేపీ నాయకురాలు తుల ఉమ



మాట్లాడుతున్న తుల ఉమ

కథలాపూర్ (వేములవాడ): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు తుల ఉమ పేర్కొన్నారు. బుధవారం కథలాపూర్‌లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రొబెషనరీ కాలాన్ని నాలుగేళ్లు పెంచి మోసం చేశారని, ఇప్పుడు రెగ్యులరైజేషన్ చేస్తామని మరోసారి మోసం చేశారన్నారు. పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇక్కడ బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు శ్రీరాముల ప్రకాశ్, నరెడ్ల రవీందర్ రెడ్డి, మేడిపెల్లి గంగాధర్, సంజీవ్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

• వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

కథలాపూర్ (వేములవాడ): అకాలవర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఆయన వెంట రైతులు మహేశ్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ ప్రభుత్వ పథకాలు

• శాసన మండలి సభ్యుడు ఎల్.రమణ
• రాయికల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



ఎమ్మెల్సీ రమణను సన్మానిస్తున్న నాయకులు

రాయికల్(జగిత్యాల):సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందని శాసన మండలి సభ్యుడు(ఎమ్మెల్సీ) ఎల్.రమణ సూచించారు. పట్టణంలో బుధవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలను కలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా గతంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. సంక్షేమ పథకాలను ఫలాలను అర్హుల దరిచేరేలా చర్యలు తీసుకున్నానని తెలిపారు. రాయికల్ మండలంలోని వివిధ గ్రామాలనూ ఎంతో అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్సీ రమణను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమాదేవి, అచ్యుత్‌రావు, మహేందర్‌బాబు, రుక్కు, బూర్గుల రాజేందర్, బొమ్మకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'సాక్షి'వేసవి శిక్షణ శిబిరం

• విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి
• మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్



చెస్ ఆడుతున్న విద్యార్థులు

జగిత్యాల జోన్ : సాక్షి మీడియా, కిడ్జి రూట్స్ పాఠశాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. చెస్, డ్యాన్స్ వంటి వాటిపై నిపుణుల చేత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించగా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొదటి రోజు చదరంగం, రెండో రోజు నృత్యంపై శిక్షణ ఇవ్వగా, మూడో రోజు శిక్షణా శిబిరం ముగింపు సమావేశం జరిగింది.

కొత్త విషయాలు తెలుసుకోవాలి

విద్యార్థులు చదువుతో పాటు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ సేవలో సాక్షి మీడియా ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సాక్షి స్టాఫ్ రిపోర్టర్ కందుకూరి శశిధర్, క్రైం రిపోర్టర్ గూడ మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ జిల్లా ఉమాకాంత్, శిక్షకులు పాల్గొన్నారు.

ఎన్నో విషయాలు నేర్చుకున్నా



'సాక్షి' నిర్వహించిన వేసవి శిక్షణలో చదరంగానికి సంబంధించి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. శిక్షణలో కొత్త స్నేహితులతో పరిచయం పెరిగింది. ఇలాంటి శిక్షణ శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉంది.

– సహస్ర, విద్యార్థిని

డ్యాన్స్‌పై శిక్షణ ఇచ్చారు



నేను ఎక్కువగా సెల్ ఫోన్‌లో గేమ్స్ ఆడే వాడిని. ఇప్పుడు సాక్షి శిబిరానికి వచ్చి డ్యాన్స్ నేర్చుకున్నా. ఇంటివద్ద పాటలపై డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నా. డ్యాన్స్ మాస్టార్లు రకరకాల స్టెప్‌లపై శిక్షణ ఇచ్చారు.

– అదిత్ సాయి, విద్యార్థి

చెస్‌పై ఆసక్తి



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు చాలా విషయాలు నేర్చుకున్నారు. చదరంగంపై కొంతమంది విద్యార్థులు ఆసక్తి చూపగా, మరికొందరు డ్యాన్స్‌పై మక్కువ చూపారు. పలు పాఠశాలల విద్యార్థులతో స్నేహాలు పెరిగాయి.

– శ్రీకాంత్, చెస్ శిక్షకుడు